నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 2 ఆగస్టు 2024 | MAHABUBNAGAR NARAYANPET



## కృష్ణమ్మకు ఏపీ సీఎం జలహారతి

శ్రీశైలం, ఆగస్టు 1 : శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామిని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు దర్శించుకున్నారు. గురువారం ఉదయం సున్నిపెంటకు హెలికాప్టర్‌లో చేరుకున్న ముఖ్యమంత్రికి కలెక్టర్ రాజకుమారి, మంత్రులు ఫరూక్, జనార్దన్‌రెడ్డి, రామానాయుడు, రవికుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన గోపురం వద్ద ఏపీ సీఎంను ఆలయాధికారులు పూర్ణకుంభంతో ఆహ్వానించారు. డ్యాం వద్ద కృష్ణమ్మకు సారె సమర్పించి జలహారతి ఇచ్చారు.

## దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 1 : డా.బీఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ సత్యనారాయణగౌడ్ గురువారం ప్రకటనలో కోరారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ (తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంల్లో) చేరడానికి అవకాశం ఉందన్నారు. పీజీలో ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ(మ్యాథ్స్) కోర్సుల్లో చేరవచ్చన్నారు. ఈ అవకాశం ఈ నెల 18వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు braou.ac.in వెబ్‌సైట్‌ను లేదా 7382929609 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### స్థానిక సంస్థల ఎన్నికలకు
## సిద్ధం కావాలి

పెద్దమందడి, ఆగస్టు 1 : స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని వెల్టూరులో మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి నివాసంలో వెల్టూరు, బలీదుపల్లి గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ సంసిద్ధులు కావాలని, గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను గుర్తు చేస్తూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాలను వివరించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గద్వాల పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

# మిన్నంటిన నిరసనలు

- మహిళా ఎమ్మెల్యేలపై సీఎం వ్యాఖ్యలకు భగ్గు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ కన్నెర్ర
- పలుచోట్ల రేవంత్ దిష్టిబొమ్మ దహనాలు
- గులాబీ శ్రేణులను నిర్బంధించిన పోలీసులు

అసెంబ్లీలో ఆడబిడ్డలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన నీచమైన వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ భగ్గుమన్నది. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనలు హోరెత్తాయి. పలుచోట్ల రేవంత్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న గులాబీ శ్రేణులపై పోలీసులు నిర్బంధంతో అడ్డుకునేందుకు యత్నించారు. కొందరిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. వనపర్తిలో నిరంజన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ మహిళా ఎమ్మెల్యేలను కించపర్చడం సీఎం పదవికే కళంకమని, వారికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే పలువురు నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రతిపక్షాల గొంతు నొక్కుతూ, ఎన్నికల హామీలు అమలు చేయమని అడిగితే సీఎం సమాధానం ఇవ్వకుండా ఎదురుదాడికి దిగుతున్నారని మండిపడ్డారు. మహిళలను అవమానించే వ్యాఖ్యలు చేస్తూ దురహంకారాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు.

*- మహబూబ్‌నగర్, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*



నారాయణపేట జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న పార్టీ నేతలు



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు ఈడ్చుకెళ్తున్న పోలీసులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

## సీఎం పదవికే కళంకం

- బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలను కించపరచడం తగదు
- రేవంత్.. బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ) : శాసనసభలో మహిళా ఎమ్మెల్యేలను కించపరుస్తూ రేవంత్‌రెడ్డి మాట్లాడిన భాష సీఎం పదవికే కళంకమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. నీకంటే ముందు నుంచి రాజకీయాల్లో ఉండి మంత్రులుగా పనిచేసిన మహిళా నాయకులను ఉన్మాద భాషతో రేవంత్‌రెడ్డి అవమానించడం అత్యంత దారుణమన్నారు. బుధవారం వనపర్తిలోని తన నివాసంలో నిరంజన్‌రెడ్డి అసెంబ్లీలో సీఎం మాట్లాడిన తీరుపై విలేకరులతో మాట్లాడారు. సీఎం సీటు ఎక్కిన తొలిరోజు నుంచి అడ్డమైన భాషను వాడుతున్నాడని, గతంలో ఏ ముఖ్యమంత్రులు ఇలాంటి భాషను ఉపయోగించలేదని, నిజాలు మాట్లాడితే తట్టుకోలేక, అధికారం ఉందని కసితో వ్యవహరించడం సరైంది కాదన్నారు. మాట్లాడిన తీరుకు భేషజాలకు పోకుండా క్షమాపణలు చెప్పాలని, నీకు వచ్చిన సీఎం పదవిని సద్వినియోగం చేసుకోవాలని, ఇప్పటికైనా కనువిప్పు కలగకపోతే చరిత్ర క్షమించదన్నారు. కాంగ్రెస్ అంటే.. రేవంత్ అన్నట్లు వ్యవహరిస్తున్నాడని, బీఆర్‌ఎస్‌లో రాజకీయం మొదలెట్టిన నీవు ఇంత నిస్సిగ్గుగా వ్యవహరించడం సరికాదన్నారు. ఆరు గ్యారెంటీలకు పాతరేసి.. అద్భుతమైన పాలన అంటూ కి తాబిస్తున్నారని విమర్శించారు. పాలన అంతా బాగా ఉంటే, రైతులు, నిరుద్యోగులు, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, ఆటో కార్మికులు ఎందుకు రోడ్లెక్కుతారని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. ఎనిమిది నెలల కాంగ్రెస్ దుర్భరమైన పాలనకు నిలిచిపోయిన సంక్షేమ పథకాలే నిదర్శనమన్నారు. రైతుబంధుపై దోబూచులాడుతున్నారని, గుట్టలు.. గట్ల పేరుతో కమిటీలు వేసి కాలయాపనతో రైతులకు తీరని వ్యధను మిగిల్చారని ఆవేదన వ్యక్తం చేశారు. వానకాలం సేద్యం మొదలైనప్పటికీ రైతుబంధు ఊసెత్తడం లేదని, ఎలాగైనా ఈ సీజన్‌లో ఎగ్గొట్టాలన్నదే కాంగ్రెస్ ఎత్తుగడ అని విమర్శించారు. రుణమాఫీ అంటూ కేవలం గొప్పలు చెబుతున్నారని గ్రామాల్లో రైతుల దగ్గరకు వెళితే అసలు విషయం వారికి అర్థమవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన గాడి తప్పిందని, రేవంత్‌రెడ్డి ఎంతోకాలం సీఎం పదవిలో ఉండే అవకాశాలు కనిపించడం లేదన్నారు. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న భయంకరమైన విషయాలపై కాంగ్రెస్ అధిష్ఠానమే భీతిల్లుతున్నట్లు కొన్ని వార్తల ద్వారా వింటున్నామన్నారు. తెలంగాణలో కూడా అలాంటి వాతావరణమే ఉందని, కాంగ్రెస్ అధిష్ఠానం సైతం విస్తుపోవడం ఖాయమన్నారు. క్షమాపణలు చెప్పకుంటే అహంకార మాటలే పతనానికి దారి తీస్తాయని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, రమేశ్‌గౌడ్, మాణిక్యం, విజయ్‌కుమార్, అశోక్, రవి, నాగన్నయాదవ్, తిరుమల్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, గిరి, జోహెబ్, రాము, శ్రీనివాసులు ఉన్నారు.



మహబూబ్‌నగర్‌లో నినాదిస్తున్న మహిళలు



వనపర్తి పట్టణంలో బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలతో కలిసి నిరసన తెలుపుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్



జడ్చర్లలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

## కృష్ణా, తుంగభద్రకు స్థిరంగా వరద

గద్వాల/అయిజ/శ్రీశైలం, ఆగస్టు 1 : కృష్ణానది ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు శ్రీశైలానికి వరద పోటెత్తుతున్నది. ఎగువన ప్రాజెక్టుల నుంచి 3,09,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండడంతో గురువారం ఉదయం నుంచి డ్యాం పది గేట్లను 18 అడుగులు ఎత్తి దిగువకు 4,30,790 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అదే విధంగా కుడి, ఎడమ గట్టు విద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా 60,232 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులకుగానూ 883.70 అడుగులు, పూర్తిస్థాయి నీటినిల్వ 215.807 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 208.2841 టీఎంసీలు ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టుకు 3,08,000 ఇన్‌ఫ్లో నమోదు కాగా 42గేట్లు 2,81,514 క్యూసెక్కుల నీటిని దిగువకు (శ్రీశైలానికి) విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తి స్థాయి నీటి మట్టం 318.516 మీటర్లు కాగా ప్రస్తుతం 317.740 మీటర్లు ఉన్నది. పూర్తి స్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 8.107 టీఎంసీలుగా నమోదైంది. కాగా ప్రాజెక్టు నుంచి విద్యుదుత్పత్తికి 18,557, నెట్టెంపాడు లిఫ్ట్‌కు 750, భీమా లిఫ్ట్‌కు-2కు 750, ఎడమ కాల్వకు 820, కుడికాల్వకు 658, కోయిల్‌సాగర్‌కు 630, సమాంతర కాల్వకు 850 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 1,98,095 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 1,79,984 క్యూసెక్కులు నమోదైంది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 98.062 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1633 అడుగుల నీటి మట్టానికి గానూ 1631.05 అడుగులు ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు 1,57,800 క్యూసెక్కులు ఇన్ ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో 1,57,250 క్యూసెక్కుల వరద సుంకేసుల బ్యారేజీకి చేరుతోంది. ఆర్డీఎస్ ఆయకట్టుకు 550 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అదేవిధంగా కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 3,41,111 క్యూసెక్కులు చేరగా, అవుట్ ఫ్లో 3,50,000 నమోదైంది. గరిష్ఠస్థాయి నీటి మట్టం 1705 అడుగులకు గానూ 1690.37 అడుగులు ఉన్నది. పూర్తిస్థాయి నీటిమట్టం 129.72 టీఎంసీలకు గానూ, ప్రస్తుతం 66.601 ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 3,35,000 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 3,25,838 క్యూసెక్కులు నమోదైంది. గరిష్ఠస్థాయి నీటిమట్టం 1615 అడుగులకు గానూ ప్రస్తుతం 1605.85 అడుగులు ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ 37.64 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 23.934 టీఎంసీలు ఉన్నది.




జూరాల గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న వరద

## రుణమాఫీ దక్కని రైతులే అధికం

- వంగూరు ఐవోబీలో 4,776 మందిలో 2,100 మంది రైతులకే వర్తింపు
- బ్యాంకుల చుట్టూ చక్కర్లు
- కటాఫ్ తేదీలోగా రుణాలు తీసుకున్నా మాఫీ కాలేదని ఆందోళన

వంగూరు, ఆగస్టు 1 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటుండగా మరోపక్క అర్హులైన రైతులు రుణమాఫీ అందకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. వంగూరులోని ఇండియన్ ఓవర్‌సిస్ బ్యాంకులో వివిధ గ్రామాలకు చెందిన 4,776 మంది రైతులు రూ.2లక్షల రుణమాఫీకి అర్హులు కాగా వారిలో మొదటి విడుతలో రూ.లక్ష రుణమాఫీ 1600 మందికి, రెండో విడుత రూ.1.50లక్షల రుణమాఫీ కేవలం 500 మంది రైతులకు మాత్రమే వర్తించింది. మొదటి విడుత 1600 మంది రైతులకు ఫోన్లల్లో సమాచారం వచ్చినప్పటికీ ఖాతాలో జమకాకపోవడంతో వారు బ్యాంకు చుట్టూ తిరుగుతున్నారు. మరో పక్క ప్రభుత్వం ఇచ్చిన కటాఫ్ డేట్‌లో రుణాలు పొందినప్పటికీ మాఫీకాక వారు వ్యవసాయ అధికారులు, బ్యాంకర్ల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మరి కొంతమంది రైతుల ఆధార్ వేరే బ్యాంకులో రుణాలు పొందిన రైతుల ఖాతాలకు ఉండడంతో అసలు రైతు తీవ్రంగా నష్టపోతున్నారు. 2023 డిసెంబర్ తర్వాత రెన్యూవల్ చేసుకున్న రైతులకు రుణమాఫీ వర్తించకపోవడంతో వారూ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది రైతులకు రుణమాఫీ వర్తించకపోవడంతో బుధవారం వంగూరులోని ఐవోబీ బ్రాంచ్‌కు రైతులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఏవో తనూజ బ్యాంక్ మేనేజర్ నాగరమేశ్‌తో కలిసి రైతుల వివరాలు పరిశీలించారు. ఏది ఏమైనా ప్రభుత్వం రుణమాఫీ అర్హులందరికీ వర్తింపజేయాలని, లేదంటే ప్రభుత్వం ఇచ్చే రుణమాఫీకి అర్థమే ఉండదని రైతులు పేర్కొంటున్నారు.



వంగూరు ఐవోబీలో రైతుల వివరాలను పరిశీలిస్తున్న మేనేజర్ నాగరమేశ్, ఏవో తనూజ

### రుణమాఫీ మాయ..



ఈ ఫొటోలోని రైతుపేరు గోవిందు. ధన్వాడ మండలం మందిపల్లి స్వగ్రామం. రెండెకరాల 30గుంటల పొలం ఉంది. ధన్వాడ యూనియన్ బ్యాంక్‌లో గత ఏడాది జూలై 17న లక్షా 30వేలు పంటరుణం తీసుకున్నాడు. రుణమాఫీ రెండో విడుతలో మాఫీ కావాలి. కానీ విచిత్రం ఏమిటంటే ఈ రైతుకు మొదటి విడుతలో రూ.30,739 మాఫీ అయినట్లు బ్యాంక్ అధికారులు చెబుతున్నారు. మిగతా రూ.లక్షా6,700 కట్టి లోన్ రెన్యూవల్ చేసుకోవాలని బ్యాంక్ అధికారులు చెబుతున్నారని రైతు గోవిందు మరికల్‌లో ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మొదటి, రెండో విడుతలోనే మొత్తం రుణం మాఫీ కావాలి. కానీ మొదటి విడుతలో రూ.30,739 మాఫీ కావడం ఏమిటని, రూ.1,06,700 చెల్లించాలని బ్యాంకు అధికారులు అడగటం ఏమిటని రైతు గోవిందు ప్రశ్నిస్తున్నాడు.

*- మరికల్, ఆగస్టు 1*

## సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి

- ఎస్సీ వర్గీకరణపై కేసీఆర్ హయాంలోనే తీర్మానం చేశాం
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- పాలమూరులో సంబురాలు

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 1 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణచౌరస్తాలో వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వర్గీకరణ సంబురాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో గతంలో చాలామంది రిజర్వేషన్లు తొలగించాలని గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించారని గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని గత బీఆర్‌ఎస్ ప్ర భుత్వంలోనే అసెంబ్లీలో తీర్మానం చేసి పం పినట్లు చెప్పారు. తాను మంత్రిగా ఉన్న స మయంలో ఎస్సీ వర్గీకరణ అంశంపై పలుమార్లు అసెంబ్లీలో మాట్లాడానన్నారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా సుప్రీం తీర్పును వెంటనే అమలు చేయాలని ఆయ న డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్